క్లుప్తంగా

జాతర కమిటీ ధన్యవాదాలు



పుత్తూరు జాతర కమిటీ సభ్యులు

పుత్తూరు: గ్రామ దేవత పిడికిలి గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి సహకరించిన పట్టణ ప్రజలకు, రాజకీయ ప్రముఖులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు జాతర కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. జాతర నిర్వహించిన బజారువీధిలో గురువారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ పుత్తూరు జాతర వైభవాన్ని చాటిచెప్పడంలో ప్రతి ఒక్కరి సహకారం అభినందనీయమన్నారు. జాతర ఉభయదారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

నింద్ర: ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం గురువారం మండల కేంద్రమైన నింద్ర జూనియర్ బాలికల కళాశాలలో నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణపై స్టెప్స్ నగరి వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సభ్యురాలు జయసుధ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాపించకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వాటికి సంబంధిత మందుల వివరాలు కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీర్ ఎడ్యుకేటర్ హారతి, సుజీ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉపకార వేతనాలు పంపిణీ

నగరి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుర్తించిన పేద విద్యార్థులు 12 మందికి ఒక్కొక్కరికి రూ.3000 వంతున ఉపకార వేతనాలను అందించారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ హెచ్.ప్రభాకర్ రాజు, కార్యదర్శి ఎ.మోహన్, కోశాధికారి శక్తివేల్, డైరెక్టర్లు ఆర్ఎం దేవన్, కిషోర్ కుమార్, సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గురువు పాత్ర విశిష్టం

కార్వేటినగరం: మంచి సమాజ నిర్మాణంలో గురువు పాత్ర ఎంతో విశిష్టమైనదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయలురెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ముందస్తు వేడుకలను కళాశాలలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆదర్శవంతుడైన సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం వెనుకగల కారణాన్ని వివ రించారు. విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి విద్య మూలహేతువు అయితే విద్యార్థి అభ్యున్నతికి ఆకాంక్షించే దివ్య చైతన్యమూర్తి గురువు అని తెలియజేశారు. అనంతరం అధ్యాపకులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి ధనంజయరెడ్డి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చందామరై



నగరి: ఆశ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నగరి మండలం, బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీకి చెందిన చందామరై ఎన్నికయ్యారు. కడపలో నిర్వహించిన ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు జిల్లా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. స్థానిక ఆశా వర్కర్లు, ఏఐటీయూసీ కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు. ఆశాలు ఎదుర్కొంటున్న వేతన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా చందామరై తెలిపారు.

గురువులదే గురుతర బాధ్యత



సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే గురుతర బాధ్యత గురువులదేనని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 5వ తేదీన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అయితే అదే రోజు మిలాడినబి పండుగ రావడంతో ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించిందన్నారు. అందుకే ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుడు ప్రముఖ పాత్ర పోషిస్తాడని, విద్యార్థి ఉన్నతికి మార్గదర్శకంగా నిలుస్తాడని తెలిపారు. అంతకు ముందు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుకాసురుల తెగింపు

- తమిళనాడుకు అక్రమంగా తరలిపోతున్న ఇసుక
- పట్టించుకోని పోలీసులు, అధికారులు



శ్రీరంగరాజపురం వద్ద గ్రావెల్ తరలింపు



పోలీసుల అదుపులో చెన్నైకి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి అక్రమార్కులు అడ్డమైన దారుల్లో అక్రమ సంపాదనతో కోట్లు గడిస్తున్నారు. అక్రమ సంపాదనతో దొరికినవాడు దొంగగా దొరకనివాడు దొరగా చలామణి అవుతూ తిరుగుతున్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని ప్రకృతి వనరులను చెన్నైకి తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. మండలంలో నీవానది పరివాహక ప్రాంతం నుండి ఇసుకను గతంలో చెన్నైకి తరలిస్తున్న పలు సందర్భాలలో పోలీసులు కొంత అడ్డుకట్ట వేసి, నివారించారు. ప్రస్తుతం ఇసుకాసురులు కొత్త పద్ధతిలో నెల్లూరు, గూడూరు పరిసర ప్రాంతాల నుండి జీడీనెల్లూరు ద్వారా చెన్నైకి తరలిస్తున్నారు. ఈ అక్రమార్కుల దొడ్డిదారిలో ప్రతినిత్యం నియోజకవర్గ పరిధిలో రెండు మూడు టిప్పర్లను మైన్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లు, పోలీసులు పట్టుకోవడం, చిన్నచిన్న జరిమానాలు విధించి, పంపించడం ఆనవాయితీగా మారిపోయింది.

రెండు ఇసుక టిప్పర్ల సీజ్

గంగాధరనెల్లూరు మండల పరిధిలో ఆదివారం రాత్రి రెండు ఇసుక టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద సాధారణ తనిఖీలలో భాగంగా సీఐ శ్రీనివాసంతి తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా రెండు లారీలు వెళ్తుండగా పట్టుకున్నారు. గూడూరు నుండి చెన్నైకి జీడీ నెల్లూరు మార్గంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టుగా గుర్తించి లారీ యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడీ నెల్లూరు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

గ్రావెల్ మాఫియా ఆగడాలు

నియోజకవర్గ పరిధిలో కొండలు గుట్టలు చదును చేసి, వందలాది టిప్పర్లతో చెన్నైకి తరలించి కొందరు అక్రమార్కులు కోట్లు గడిస్తున్నారు. పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల్లో కొండలు గుట్టలను తవ్వేసి, గ్రావెల్ ఉన్న చెన్నైకి తరలిస్తుంటే, రెవెన్యూ శాఖ వారు పట్టుకుంటే మాత్రం గ్రావెల్ కేసీసీ రోడ్డు నిర్మాణం పనుల నిమిత్తం వాడుకుంటున్నామని బుకాయిస్తూ, చెన్నైకి తరలించేస్తున్నారు. చెన్నైలో మట్టి ఇసుక డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు పరిధిలో తర్చూరు హైవే పనులు 95 శాతం పూర్తి అయిపోయినట్లు తెలిసినా నేడు ఇసుక, గ్రావెల్ కేసీసీ పనులకు అంటూ బుకాయిస్తున్న వారిపై ప్రజలు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం పట్టించకోకపోవడం గమనార్హం.

వధూవరులకు ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన నింద్ర మండలం చవరంబాకం గ్రామానికి చెందిన ఓ విలేకరి కుమార్తె వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక జీడీఆర్ మండపంలో విజయపురం మండలం కలియంబాకం గ్రామ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి బంధువుల వివాహ రిసెప్షన్‌లో ఆమె పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపు

విజయపురం: మండలంలో మహరాజపురం గుట్ట నుంచి కనకమ్మసత్రం అనుకొని ఉన్న ఓ ప్రైవేటు ప్లాట్‌కు గత రెండు రోజులుగా టీడీపీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ విషయం స్థానికులు తహశీల్దార్‌కు చెప్పినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకులు ఇచ్చే మామూళ్ల మత్తులో అక్రమ గ్రావెల్ తరలింపునకు సహకరిస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు. అక్రమ గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నారు.

రైతులను దగా చేస్తున్న కూటమి



నియోజకవర్గ నాయకులతో సమావేశమైన కృపాలక్ష్మి

- యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న అన్నదాతలు
- రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలబడుతుంది
- జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలకు అండగా నిలిచారని జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. గురువారం ఆమె పుత్తూరులోని తన నివాసంలో ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల పక్షాన పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ చిత్తూరు ఆర్డీఓకు వినతిపత్రం అందించే కార్యక్రమం చేపడదామన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని, రైతుల పట్ల అధికార ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేఖ విధానాలను ప్రజల ముందు పెట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కడవరకు రైతు పక్షాన నిలిచిందని, ఇప్పటికీ వారి కోసమే పోరాటానికి సిద్ధమవుతోందన్నారు. రైతులకు సరిపడా యూరియా అందించలేని సీఎం చంద్రబాబు నాయుడు రైతులను తప్పుదారి పట్టించడానికి యూరియా ఎక్కువ వాడొద్దని.. రోగాలు వస్తాయని రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. యూరియా కొరతపై సోషల్ మీడియాలో పెడితే కేసులు పెడతామని బెదిరించడం సరి కాదన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వృత్తులకు మూలం ఉపాధ్యాయ వృత్తి



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: ప్రపంచంలో ఏ వృత్తిలో రాణించాలన్నా ఉపాధ్యాయులే మూలమని, ఆ వృత్తే ఆధారమని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదమునిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ముందస్తు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మాజీ రాష్ట్రపతి, గొప్పతత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు ఆదర్శవంతుడని కొనియాడారు. ఇందులో భాగంగా రాధాకృష్ణన్ చిత్రపటాన్ని రంగవల్లులు, పూలతో అలంకరించి హ్యాపీ టీచర్స్‌డే అంటూ ఆంగ్ల అక్షర క్రమంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఎంఈఓ నమశ్శివాయ, విశ్రాంతి ఉపాధ్యాయుడు సోమసుందరం పిళ్లై పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజుతో పాటు, డీఎం పురం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి



పిల్లలకు వేస్తున్న టీకాలపై వివరిస్తున్న జిల్లా యూవిన్ కోఆర్డినేటర్ శివరామకృష్ణ

పాలసముద్రం: మండల పరిధిలోని చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాల్సిన బాధ్యత సంబంధిత ఏఎస్ఎంలపై ఉందని జిల్లా యూవిన్ కోఆర్డినేటర్ శివరామకృష్ణ తెలిపారు. గురువారం పాలసముద్రం పీహెచ్‌సీలో వైద్యాధికారులు జయకుమార్, మోహన్‌కృష్ణ సమక్షంలో ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు వ్యాక్సినేషన్‌పై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. విచ్చేసిన శివరామకృష్ణ మాట్లాడుతూ చిన్నారులకు వయస్సు ఆధారంగా టీకాలు విధిగా వేయాలన్నారు. పోలియో, కోరింత దగ్గు తదితర ప్రమాదకర వ్యాధులని, వాటికి టీకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి చిన్నారికీ సకాలంలో వేయించాలని సూచించారు. ఇందులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నారులకు వేస్తున్న టీకాలను యూవిన్ యాప్‌లో చిన్నారి, వారి తల్లిదండ్రుల పేర్లు తప్పక చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్రమణ్యం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా పని చేద్దాం

- మండల మీట్‌లో ఎంపీపీ లత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కలసి పని చేయాలని ఎంపీపీ లత అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీఓ చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల సలహాలను అధికారులు పాటించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశం దృష్టికి ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన ప్రతి సమస్యను అధికారులు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నివృత్తి కాని.. జఠిలమైన సమస్యలు ఉంటే వాటి తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం శాఖల వారీగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, గోపిశెట్టిపల్లి ఎంపీటీసీ మురగయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. అల్లాగుంట గ్రామంలో తాగు నీటి సమస్య ఉందని, బోరు మంజూరైందని, అనుమతులిస్తే బోరు వేసుకుంటామని సర్పంచ్ సుందర్‌రాజు విన్నవించారు. అలాగే గాజంకి, జాండ్లపేటకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు కొన్ని చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయని వెంటనే పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని సర్పంచ్ శేఖర్‌రెడ్డి కోరారు. కత్తెరపల్లి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరైన భవనాలు లేక వైద్య పరీక్షలు చేయడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. అనంతరం ఎంఈఓ-2 మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని బీడీ కార్మికుల కాలనీలో ఉన్న పాఠశాల పెచ్చులూడి పడుతున్నాయని, మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని కోరారు. గోపిశెట్టిపల్లి ఎంపీపీ పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని, ఆ భవనాలకు ప్రహరీ నిర్మాణం చేసి అందులో లైబ్రరీ ఏర్పాటు చేయాలని గోపిశెట్టిపల్లి సర్పంచ్ కరుణశ్రీ కోరారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమంగా తమిళనాడుకు గ్రావెల్ తరలిస్తున్నారని, సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నూరు పంచాయతీ సర్పంచ్ సుందర్‌రాజ్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ చంద్రమౌళి ఆర్కేవీబీపేట, గోపిశెట్టి పల్లి పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని, అలాగే కత్తెరపల్లి పీహెచ్‌సీ ఆధునీకరణకు రూ.3.60 లక్షలు నిధులు వచ్చాయన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా నిలుద్దాం

- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన మాజీ మంత్రి ఆర్కే రోజా



పార్టీ శ్రేణులు, రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: ఆరుగాలం శ్రమించినా ఆశించిన ఫలితాలు రాక, పాలక ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందక విలవిల్లాడుతున్న రైతన్నకు పార్టీ శ్రేణులు అండగా నిలబడాలని, వారికి న్యాయం జరిగేవరకు పోరాడాలని మాజీ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. గురువారం తన నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గ పార్టీ శ్రేణులు, రైతులతో ఆమె సమావేశమయ్యారు. ప్రస్తుత పాలనలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

అందని ద్రాక్షగా ఎరువులు

గతంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, యూరియా అందేదని, ప్రస్తుతం రైతుకు ఎరువులు అందని ద్రాక్షగా మారాయని పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సరిహద్దులోని తమిళనాడుకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసుకొని ఆటో బాడుగ పెట్టుకుని తీసుకురావాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం యూరియా ఇస్తామని అధికారులు చెబుతున్నా ఎంత విస్తీర్ణంలో నేల ఉందన్న అంశాన్ని తెలుసుకోకుండా పాసుపుస్తకానికి ఒక బస్తా ఇస్తామని చెబుతున్నారని వాపోయారు.

9న రైతుల పక్షాన పోరాటం

అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ రైతుకు అన్ని విధాలా సహకారం అందించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. పంట బీమా, ఈ క్రాప్ అంటూ రైతును వేధించడం తగదన్నారు. ఈవీఎంల మాయతోనో, ఆశలకు మోసపోవడంతోనో చంద్రబాబు పాలన వచ్చిందన్నారు. వ్యవసాయం దండగని స్వీయ చరిత్రలో రాసుకున్న ఆయన రైతులకు ఎప్పటికీ సహకారం అందించడన్నారు. జగనన్న చొరవ చూపనిదే రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా లేవన్నారు. పసుపు రైతులకు, మిర్చీ రైతులకు, పొగాకు రైతులకు, మొన్నటికి మొన్న మామిడి రైతులకు జగనన్న పోరాటం తరువాతే న్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎరువులు, యూరియా లేక విలవిల్లాడిపోతున్నారని, వారి పక్షాన వైఎస్ఆర్ సీపీ శ్రేణులు నిలవాలన్నారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాడాలన్నారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, వినతిపత్రం అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, నగరి, పుత్తూరు, నింద్ర ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, మండల వ్యవసాయ విభాగం అధ్యక్షులు, పార్టీ కమిటీల సభ్యులు, అనుబంధ కమిటీల సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేబీఆర్‌పురం మీదుగా బస్సులు నడపాలి

పుత్తూరు: రూరల్ మండలం కేబీఆర్‌పురం గ్రామం మీదుగా పళ్లిపట్టు, అమ్మపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లా కలెక్టర్, తిరుపతి ఆర్ఎంలకు వినతిపత్రాలు సమర్పించారు. తిరుమలకుప్పం సర్పంచ్ సరస మాట్లాడుతూ గతంలో పుత్తూరు ఆర్టీసీ డిపో నుంచి కేబీఆర్‌పురం మీదుగా పళ్లిపట్టుకు 10 ట్రిప్పులు, అమ్మపల్లికి 6 ట్రిప్పుల వంతున బస్సులు నడిచేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ఒకే బస్సు పళ్లిపట్టుకు కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే తిరుగుతోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం స్త్రీశక్తి పథకం కింద గతంలో నడిపిన విధంగా బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వైస్ ఎంపీపీ విమల, కేబీఆర్‌పురం, కృష్ణసముద్రం సర్పంచులు జానకీ, దయా, ఎంపీటీసీలు, పలు గ్రామాల ప్రజలు ఉన్నారు.

కృషీవలుడికి సన్మానం



నాగరాజ పరాంకుశను సత్కరిస్తున్న గ్రామస్తులు

వడమాలపేట (పుత్తూరు): సొంత ఖర్చులతో పాఠశాల అభివృద్ధితోపాటు, విద్యార్థుల చేరికలో విశేష కృషి చేస్తున్న సీతారామాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజ పరాంకుశను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గురువారం పాఠశాలలో ముందస్తు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామపెద్ద గోపాల్‌నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నాగరాజ పరాంకుశ తన సొంత నిధులు రూ.60 వేలుతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం హర్షనీయమన్నారు.


మాజీ మంత్రికి జాతర కమిటీ ఆహ్వానం



జాతర నిర్వాహకులకు అమ్మవారి చీరలను అందిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: గంగజాతర ఉత్సవాలకు జాతర కమిటీ సభ్యులు గురువారం మాజీ మంత్రి ఆర్కే రోజాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఉత్సవాలకు చీర సారెను గంగజాతర కమిటీ వారికి ఆమె అందించారు. ప్రతి ఏడాది జాతర సందర్భంగా గ్రామదేవతలు దేశమ్మ, ఓరు గుంటాలమ్మలను ప్రత్యేకంగా అలంకరించడం పరిపాటి. ఈ మేరకు అమ్మవారికి అలంకరణకు సంప్రదాయబద్ధమైన పట్టుచీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పసుపుదారాలు, పండ్లను తన స్వగృహం వద్ద జాతర కమిటీ సభ్యులకు అందజేశారు. ఆమెను జాతర నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మదనశ్రీనివాసన్, కోలా బాలాజీ, శంకర్, రాజేష్, ధన, మహేష్, ఎల్లప్పరెడ్డి, తిరుమలరెడ్డి, రవి, దామునాయుడు, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చాలని ఆందోళన



మున్సిపల్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న రామ్‌నగర్ మహిళలు

- మున్సిపల్ కార్యాలయం వద్ద రామ్‌నగర్‌వాసుల రాస్తారోకో
- ఖాళీ బిందెలతో దర్నా

నగరి: మున్సిపల్ కొళాయిల్లో తాగునీరు వచ్చి పదిరోజులకు పైగా అవుతోందని, దాహం తీర్చండి మహాప్రభో అంటూ మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చిన వారు మంచినీటి సరఫరా జరగడం లేదంటూ ఆందోళనకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై కూర్చొని, వాహనాల రాకపోకలను ఆపేశారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఆగి ట్రాఫిక్ జామ్ అయింది. తాగునీటి సమస్య పరిష్కారమయ్యేంత వరకు రోడ్డుపై నుంచి లేవమంటూ ధర్నా చేస్తూ భీష్మించుకు కూర్చున్నారు. మున్సిపల్ నీటి సరఫరా సిబ్బంది వారించినా నిరసనకారులు శాంతించ లేదు. దీనిపై నిరసనకారులు మాట్లాడుతూ తమ ప్రాంతానికి తాగునీరు సరఫరా పదిరోజులుగా లేదన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా సమస్యను పంపించామని, అయినా నీళ్లు రాలేదన్నారు. ఏం చేస్తే నీళ్లు వస్తాయో తెలియక మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి రోడ్డుపై కూర్చున్నామన్నారు.

తాగునీటికి కటకట

గోల్డెన్ సిటీ వాసులు తాగునీరు సరఫరా కావడం లేదంటూ మున్సిపల్ అధికారులను పలుమార్లు సంప్రదించారు. ప్రజా సమస్య ల పరిష్కార వేదికలోనూ వినతి పత్రాలు సమర్పించినా తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. కాకవేడు ఏఏడబ్ల్యూ వాసులు ఇప్పటికే తాగునీరు రావడం లేదంటూ ఇప్పటికే కొళాయిల వద్ద నిరసన వ్యక్తం చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గణిత శాస్త్రం బోధించుటకు గెస్ట్ లెక్చరర్ కావాలని కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా సంవత్సరంలో పనిచేయడానికి ఎంఎస్సీ మ్యాథ్స్ పాసై, అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నేరులో వచ్చి సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలను ఈ నెల 9వ తేదీ లోపు కళాశాలలో అందజేయాలన్నారు. అలాగే ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు విద్యార్థులకు డెమో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారిని గెస్ట్ ఫ్యాకల్టీగా తీసుకొని నెలవారీ జీతం కింద రూ.27 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మా భూములకు పరిహారం ఇవ్వండి

వడమాలపేట (పుత్తూరు): తమ భూములను స్వాధీనం చేసుకొన్న తిరుమల తిరుపతి దేవస్థానం వారు పరిహారం చెల్లించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం భూముల వద్ద కొందరు బాధిత దళిత రైతులు మాట్లాడుతూ చాలా వరకు పరిహారం చెల్లించిన టీటీడీ అధికారులు కొందరికి నేటికీ పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూముల వద్ద వేసిన కొట్టాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఇకనైనా మాకు న్యాయం చేయాలని కోరారు.